క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామంలోని ముత్యాలమ్మగుడి ఆవరణలో రూ.1 కోటి ఎంపీ ల్యాడ్ నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత శంకుస్థాపన చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత తన ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి మంజూరు చేసిన రూ. కోటి నిధులతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలు తమ ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి మండలంలో రూ.2.29 కోట్లను డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సోంపాక నాగమణి, గద్దల ప్రకాశ్, గ్రామపెద్దలు పోతిరెడ్డి గోవిందరెడ్డి, మేడగం రామిరెడ్డి, చింతా పున్నారెడ్డి, కామిరెడ్డి రామకొండారెడ్డి, బాదం రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

మణుగూరురూరల్: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డిల ఆదేశాల మేరకు మణుగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ ఎస్.సతీష్‌కుమార్ గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ... ప్రజాశాంతికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో రౌడీ షీటర్లు పాల్గొన్నా, నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి నడవడిక ఉన్నవారిపై రౌడీషీట్‌లను తొలగించడానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు.

కోర్టు భవనం పరిశీలన

దమ్మపేట: మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యేను స్థానిక న్యాయవాదులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గొంది మురళి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. గురువారం ఆలయం హుండీలను తెరిచి లెక్కించగా ఈ ఏడాది జనవరి 17తేదీ నుంచి ఫిబ్రవరి 29వ తేది వరకు రూ. 61,616 వచ్చినట్లు ఆ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.జైల్ సింగ్ తెలిపారు. భక్తులు కానుకలు, నగదును హుండీల్లో మాత్రమే వేయాలని కోరారు. ఆలయ ఈఓ సూర్య ప్రకాష్, ఆలయ కమిటీ చైర్మన్ బిర్రం రమాదేవి, సరాల శ్రీను, జక్కుల జగదీష్, నారం జగదీష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని చప్టా దిగువకు చెందిన ఓ నిరుపేద కుటుంబానికి ఉపాధ్యాయుడు నాగరాజు గురువారం ఆర్థిక సాయం అందజేశాడు. కాలనీకి చెందిన కారమూరి ప్రభాకర్ అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందగా భార్య ఇద్దరు చిన్నారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

డీఎస్పీని కలిసిన ప్రిన్సిపాల్

మణుగూరురూరల్: ఇటీవలే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్, అధ్యాపకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు డీఎస్పీ రవీందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

అల్పాహారం వితరణ

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం సమయంలో అదనపు తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రొయ్యల కుమార్ గురువారం అల్పాహారాన్ని వితరణగా అందజేశారు. దాతను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిల నర్సీ, చిన్నశెట్టి గోపి, చిన్నశెట్టి మధు, వెంకట్, నాగయ్య, తిరుపతరావు, ఇంఛార్జి హెచ్‌ఎం మస్తాన్‌వలీ, ఉపాధ్యాయులు రాంబాబు, భాస్కరచారి, విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వరి, సునీత పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు కోరారు. గురువారం లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. మార్చి నెల నుంచి 200 యూనిట్లు వరకు ఉచిత అందుతుందని, 500కి గ్యాస్ సిలిండర్ ద్వారా రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగనుందని తెలిపారు. పిలక వెంకటరమణరెడ్డి, కనుబుద్ది దువా, కంగాళ వెంకటేష్, దర్శి సాంబశివరావు, వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిండు జాతర షురూ

- వనం నుంచి జనంలోకి దేవతలు
- మేళతాళాల నడుమ గద్దెలపై ప్రతిష్ఠ
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



దుమ్ముగూడెం: అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



దుమ్ముగూడెం: సమ్మక్క తల్లిని తీసుకొస్తున్న భక్తులు



కరకగూడెం: వన దేవతకు ఎదుర్కోలు నిర్వహిస్తున్న భక్తులు

దుమ్ముగూడెం: మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం సమ్మక్క-సారలమ్మ జాతరలో మూడో రోజు సమ్మక్క, వనదేవతలు వనం వీడి జనంలోకి వచ్చారు. గద్దెలపై కొలువుదీరారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో భక్తజన జయజయ ధ్వానాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కోయవారి సంప్రదాయ నృత్యాల నడుమ వనదేవతను ఆలయానికి తీసుకునివచ్చారు. సాయంత్రం 4గంటలకు సమ్మక్కను దేవర బాలలు ఊరేగింపుతో గద్దెల వద్దకు చేర్చారు. దీంతో నిండు జాతర ప్రారంభమైంది. ఛత్తీస్‌గఢ్, తెంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ, పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

దర్శించుకున్న ప్రముఖులు..

మారాయిగూడెం జాతరలో అమ్మవార్లను మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట ఎమ్మెల్యే కవ్వాసి లక్మా కుమారుడు, జిల్లా పరిషత్ చైర్మన్ కవ్వాసి హరీష్, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యానారయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు దామెర్ల శ్రీను తదితరులు దర్శించుకుని పూజలను చేశారు.

మూకమామిడిలో..

ములకలపల్లి: మూకమామిడిలో మినీమేడారం గురువారంతో ముగిస్తుండడంతో భక్తులు పోటెత్తారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతర తుది అంకాన్ని వీక్షించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు, ప్రధాన ఒడ్డెర సడియం నాగేంద్రబాబు సమీప గుట్టల నుండి సారక్కను గద్దెలపైకి తోడ్కొని వచ్చారు. డప్పు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాల, భక్తజన జయజయధ్వానాల నడుమ గిరిజన సాంప్రదాయ పద్ధతిలో అమ్మవారిని గద్దెలపై ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేశారు. సమ్మక్క ఆగమనం అనంతరం భక్తులు గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవార్లకు ముడుపులు చెల్లించుకుని, కోళ్ల యాటలు బలిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కుర్నపల్లిలో..

కరకగూడెం: మండలంలోని సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీ కుర్నపల్లి పరిధిలోని సమ్మక్క, సారలమ్మ జాతర మూడు రోజులుగా అంగరంగా వైభవంగా జరిగింది. గిరిజన సాంప్రాదాయలతో డప్పు చప్పుల్లతో వనం నుంచి వన దేవతలు గద్దెలపై కొలువు తీరారు. మంగళవారం మండెమెలుగు కార్యక్రమంతో మెదలైన జాతర బుధవారం సారలమ్మ గద్దెలపైకి చేరగా.. గురువారం నద్దిగామ గుట్ట నుంచి సమ్మక్క, పగిడిద్దెరాజును తీసుకొని వచ్చారు. ఈ క్రమంలో మార్గం మధ్యలో వనదేవతలు ఎదురుకోలు నిర్వహించుకున్నారు. అనంతరం వన దేవతలను గిరిజన సాంప్రదాయల నడుమ డప్పు వాయిద్యాలతో తీసుకొస్తుండగా అగ్ని మంటలు ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటలకు సమ్మక్క, పడిగిద్దెరాజుకు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల నుంచి భక్తులు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి దేవర బాల పోలెబోయిన కరుణకర్ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కట్టమైసమ్మ ఆలయంలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని కట్టమైసమ్మ తల్లి ఆలయంలో జాతర మహోత్సవాల సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిత్యపూజ, కలశ గ్రామోత్సవం, అష్టోత్తర కలశ ఆధారన చేసి అభిషేకాలు చేశారు. అలాగే జాతర ఉత్సవాలకు రాత్రి సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ పరిసరాలు భక్తులతో పోటెత్తాయి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వయంబు శ్రీదేవి భూదేవి సమేత అభినవ వెంకటేశ్వరస్వామి 20వ వార్షిక తిరుకల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం స్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణమహోత్సవంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామపెద్దలు, స్థానికులు, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి

మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీలోని రాళ్లవాగుపై నిర్మించాల్సిన హైలెవల్ వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. త్వరలోనే హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ గాదె జయ, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని వాసు, వేములపల్లి రమేస్, ఓరుగంటి రమేష్, వీరమాచనేని రాజశేఖర్, బిక్కసాని సత్యనారాయణ, అక్కిన అచ్చుతరామారావు, బూరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఆదమరిస్తే అంతే సంగతి



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి వెంకటేశ్వర కాలనీకి వెళ్లే దారిలో సీపీఐ కార్యాలయం సమీపంలో డ్రెయినేజీ కాలువపై ఉన్న సిమెంట్ స్లాప్ కుంగిపోయింది. దీంతో గుంతలా ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి వెంట వెళ్లే వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురయ్యే ప్రమాదముంది. ఆదమరిచి వాహనాన్ని నడిపితే అంతే సంగతి అన్నట్లుగా తయారైంది. పంచాయతీ అధికారులు డ్రెయినేజ్‌పై మరమ్మతులు చేయించాల్సి ఉంది.

పారిశుద్ధ్య లోపంతోనే విషజ్వరాలు

చర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విషజ్వరాలు విజృంభించడానికి ప్రధాన కారణం పరిశుద్ధ్య లోపమేనని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ అన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ భద్రచలం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్‌తో కలిసి గురువారం కొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. జ్వరపీడితులను పరామర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, మురుగునీరంతా డ్రెయిన్లలో నిలిచిందని అన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లు డ్రెయినేజీ కింద ఉండడంతో మురుగు నీరు భగీరథ పైప్‌లైన్లలోకి దిగుతోందని అన్నారు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తక్షణమే పంచాయతీ, మిషన్‌భగీరథ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వీరి వెంట ఎర్రావుల ప్రేమ్‌కుమార్, సింగ్, వీరభద్రం, నాని, లింగమ్మ, రాణి, లలిత తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలపై వినతి

మణుగూరుటౌన్: ఐఎన్‌టీయూసీ ఓబీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆయన నివాసంలో కలిసి కార్మికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. జీతాల పెంపు అగ్రిమెంట్ల ఆవశ్యకతను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్య పరిష్కారానికి ఆయా యాజమాన్యాలతో మాట్లాడతానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపనపల్లి మహేశ్, నగేశ్ నాయడు, తమ్మిశెట్టి ఉప్పయ్య, సంపత్‌రాజ్, స్వామి, సంగీత్, సతీష్‌చారి ఉన్నారు.

'లీప్ డే' సంబురం



మల్లెలమడుగులో పడిదం నరేష్, దీప్తి వివాహం

అశ్వాపురం: నాలుగేళ్లకు ఓ సారి వచ్చే ఫిబ్రవరి 29 నాడు మండలంలో పలు శుభకార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా మల్లెలమడుగులోని పడిదం నరేష్, దీప్తిలు వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లిరోజును నాలుగేళ్లకు ఓ సారి మాత్రమే జరుపుకోవాల్సి ఉంది.

ఎమ్మెల్యే పూజలు

చర్లరూరల్: చర్ల మండలం గొమ్ముగూడెం గ్రామంలోని రామాలయంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు పాల్గొన్నారు.

సాహస వీరుడికి సన్మానం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన ఆల్ ఇండియా భారత బంజార రత్న సహాస వీర్ పురస్కార అవార్డు గ్రహీత భూక్యా కృష్ణ నాయక్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కృష్ణ నాయక్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. అలాగే ఆయన చేతుల మీదుగా జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వరల్డ్ గిన్నిస్ రికార్డును సైతం సాధించి, ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

డీఎల్‌పీఓ తనిఖీ

అశ్వాపురం: మండల పరిధిలోని సండ్రలబోడు గ్రామ పంచాయతీలో డీఎల్‌పీఓ సుధీర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో రికార్డులు, నర్సరీని పరిశీలించారు. పంచాయతీలో పారిశుద్ధ్యం, శానిటేషన్ కార్యక్రమాలను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పూజ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గంగారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం తొలిమెట్టు నోడల్ అధికారి పి.ప్రసాదరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.హరిత ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో తొలిమెట్టు ద్వారా విద్యార్థులు సాధించిన సామర్థ్యాలను తరగతి వారిగా పరిశీలించి, విద్యార్థులకు సూచనలు చేశారు. సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

నేడు వేలం

చర్ల: మండల కేంద్రంలోని పాత చర్లలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయంలో కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు గాను వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే మహాశివరాత్రి జాతరలో భక్తులకు కొబ్బరికాయలను విక్రయించుకునేందుకు గాను శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిటీ పేర్కొంది. ఆసక్తి గల వ్యాపారులు ఈ వేలంలో పాల్గొనాలని కమిటీ కోరింది.

అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నప్రసాద దాత చంద్రగిరి కోటేశ్వరరావు-నాగశ్రీ దంపతులు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కోటేశ్వరరావు దంపతులను ఆలయకమిటీ వారు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ పాల్గొన్నారు.

ఏరియాలో 80 శాతం బొగ్గు ఉత్పత్తి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జీఎం దుర్గం రామచందర్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఫిబ్రవరి మాసంలో 80 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు, 10.67 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 8.57 లక్షల టన్నుల బొగ్గు వెలికితీసినట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. ఓబీ వెలికితీతలో 14 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 14.73లక్షలు 105శాతం వెలికితీశామని తెలిపారు. ఏరియాలో రోడ్డు, రైలు, రోప్‌వే ద్వారా బొగ్గును 8.56 లక్షల టన్నులు సరఫరా చేశామన్నారు. జియో థర్మల్‌ను మరింత పెంచేందుకు ఉన్న అవకాశాలపై సర్వే జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తొలుత విద్యుత్ ప్రాజెక్టులకే బొగ్గు రవాణాలో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు 16,385 టన్నులు ప్రతీ రోజూ అందిస్తున్నామని తెలిపారు. వేసవి కాలం ప్రారంభం నుంచి 20వేల అవసరమయ్యే అవకాశం ఉందన్న అంచనా ఉందని, అందుకు తగిన విధంగా బొగ్గును అందిస్తామని అన్నారు. ఆపరేటర్ల కొరత కొంత, రొటేషన్ పద్ధతిలో డంపర్ల లేమిని అధిగమిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అధికారులు వెంకట్రావ్, సలగల రమేష్, వీరభద్రం, శ్రీనివాసరావు, మేరీకుమారి, షబ్బీరుద్దీన్ తదితరులున్నారు.

కరకట్ట పనుల పరిశీలన



డంపింగ్ యార్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీ నుంచి శిశు మందిర్ వరకు దాదాపు 700 మీటర్ల కరకట్టను కొనసాగింపు పనులను గురువారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా కరకట్ట పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న డంపింగ్ యార్డు నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పట్టణంలోని సుభాష్ నగర్ ప్రాంతం నుంచి శిశు మందిర్ వరకు 700 మీటర్లు కరకట్ట కొనసాగింపు పనులను సీపీఎం బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కరకట్ట పనులను త్వరితగతిన, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరారు. కరకట్ట ఎత్తు పెంచి, పొడిగించి పటిష్ట పరచాలని, స్లూయిజ్లను శాశ్వత ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని అన్నారు. ఈ క్రమంలో పంట మోటార్లను నష్టపోతున్న రైతులకు తగిన నష్టపరిహారం అందేలా కృషి చేయాలని డీఈని కోరారు. ఈ బృందంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబీ.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీనియర్ నాయకులు తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావులు ఉన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామ పంచాయతీలోని రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేయని చేతిపంపుకు గురువారం మరమ్మతులు చేయించారు. ఈ నెల 29న 'తాగునీటికి విద్యార్థుల అవస్థలు'అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె.అజారుద్దీన్ ఆధ్వర్యంలో పాఠశాలలో చేతిపంపునకు మరమ్మతులు చేయించారు. దీంతో విద్యార్థులకు తాగునీటి ఇబ్బంది తొలగింది.



మరమ్మతు చేసిన చేతిపంపు వద్ద విద్యార్థులు

వేతనాలు విడుదల చేయాలి

దమ్మపేట: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికుల వేతానాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారులు, మంత్రులకు విన్నవించిన న్యాయం జరగలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, ముత్తయ్య, రమ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు సమ్మె..

గుండాల: గత కొంత కాలంగా నిలిచిపోయిన డైలివేజ్ వర్కర్ల, పీఎంహెచ్ వర్కర్ల వేతనాలు చెల్లించి సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం మండల నాయకులు కొటెం బాలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డైలివేజ్ వర్కర్ల వేతనాలు 8 నెలలు, పీఎమ్‌హెచ్ వర్కర్లకు 22 నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తోలెం లక్ష్మి, ఆదిలక్ష్మి, జిగట లక్ష్మి, గడ్డం వెంకటనర్సమ్మ, వాలీ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై సమావేశం



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మణుగూరురూరల్: ఈ నెల 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణుగూరు ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, తహసీల్దార్ రాఘవరెడ్డిలు కోరారు. గురువారం మణుగూరు మండల పరిషత్ కార్యాలయంలో పోల్స్ పోలియోపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా నాలుగు రూట్‌లలో 43 బూత్‌లలో 87 బృందాలతో మూడు ట్రాన్సిట్ పాయింట్లు, ఒక మొబైల్ టీమ్, 184 సభ్యులతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సున్నా నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ఈ నెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక రైతువేదికలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హెచ్ వెంకటప్రకాష్ మాట్లాడుతూ.. మండలంలోని ఐదేళ్లలోపు వయసున్న పిల్లలు 2,550 ఉన్నట్లు గుర్తించామన్నారు. పిల్లలకు చుక్కలు వేసే విధానంపై ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ జి.జగదీశ్వర్, ఎంపీడీఓ బి.అశోక్, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, వైద్యసిబ్బంది యండి.ఇమాం, చంద్రకళ, పద్మ పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలో ఈ నెల3న నిర్వహించే పల్స్ పోలియోను సమన్వయంతో పూర్తి చేద్దామని కరకగూడెం ఎంపీపీ రేగా కాళికా పిలుపునిచ్చారు. ఆమె గురువారం స్థానిక పీహెచ్ సీలో పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్యశాఖ అధికారులకు, ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సు పాల్గొని మాట్లాడారు. పల్స్ పోలియోను నిర్ణయించిన కేంద్రాలలో 100 శాతం పూర్తి చేయాలని, ఎవరైనా తప్పితే 4, 5 తారీకులలో వేయాలని అన్నారు. వైద్యాధికారి కారం మధు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాలకు దుప్పట్ల వితరణ

చర్లరూరల్: చర్లలోని సీహెచ్‌సీకి భద్రాచలం రవీంద్ర క్లాత్ షోరూం వారి సహకారంతో రూ.5 వేల విలువ చేసే దుప్పట్లు, టవళ్లను గురువారం వైద్యులు బూరుగడ్డ సాయి వర్ధన్, పెద్దాడ కాంత్‌లకు అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే బెడ్లపై దుప్పట్లు లేవని గమనించిన మీకోసం మేమున్నాం సేవా సంస్థ టీం ఉపాధ్యక్షుడు దొడ్డి తాతారావు రవీంద్ర క్లాత్ షోరూం సహకారంతో అందించారు. కార్యక్రమంలో మీకోసం మేమున్నాం టీం అధ్యక్షుడు నీలి ప్రకాష్, గొట్టిపాటి శ్రీనివాసరావు, జవ్వాది సతీష్, మండలోజు వీరాచారి, కీశంశెట్టి రవి, రుంజా రాజారావులు పాల్గొన్నారు.